క్లుప్తంగా

‘జీవిత బీమా’లపై జీఎస్టీ ఎత్తేయాలి

నారాయణపేట టౌన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలో పనిచేసే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో జరిగిన ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ జోనల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా నారాయణపేట జిల్లా కోటకొండకు చెందిన కె.కాశీనాథ్‌ను జోనల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎల్ఐసీ సంస్థ మంచి సర్వీస్ ఇస్తుందని, దీన్ని కాపాడుకోవాలని, ఎల్ఐసీపై విధించిన జీఎస్టీ ఎత్తివేయాలని, దీర్ఘ కాలంగా ఉన్న ఏజెంట్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీని కోసం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. వీరితో పాటు పాలమూర్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీ బీసిరెడ్డి, భీంరెడ్డి, లాలప్ప పాల్గొన్నారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

నర్వ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ అరుణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మక్తల్‌లోని వట్టెం రవి కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, శిశు సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్‌రావు, డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్‌లు హాజరవుతారని వివరించారు.

బియ్యం, మందులు అందజేత



నారాయణపేట: ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల సహాయార్థం నారాయణపేటలోని సంతోషమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్షకు 50 కిలోల బియ్యం, మందులను అందజేశారు. ఆ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జేడీ కరుణాకర్, మాజీ కౌన్సిలర్ సూర్యకాంత్, కార్యకర్త శ్రీధర్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఊట్కూరు: మండలంలోని తిప్రాస్‌పల్లిలో సోమవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సుమంగళి ప్రారంభించారు. బీసీ కాలనీ నుంచి ప్రధాన రహదారి వరకు 500 మీటర్ల సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, నాయకులు సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఊట్కూరు: మండల కేంద్రంలో మాదాసి కుర్వ కులస్తులు సోమవారం రోశనలి దర్గాలో సామూహిక కందూర్లు చేపట్టారు. సుమారు 150 మంది మహిళలు జ్యోతులు తలపై పెట్టుకొని దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు చేశారు. మేకలు, గొర్రెలతో బలిచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కుర్వ కులస్తులు ఆశప్ప, గోవిందప్ప, పోలప్ప, ఆశప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి పాటుపడ్డా

నర్వ: ఉమ్మడి జిల్లాలోనే మండల సహకార సంఘం ముందజలో ఉందని పీఏసీసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 77 సొసైటీలలో నర్వ సొసైటీని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. రుణాల రికవరీలో సత్ఫలితాలు సాధించామన్నారు. దీనిని డీసీసీబీ అధికారులు గుర్తించి నర్వ సొసైటీకి రూ.1.52 కోట్ల విలువ గల వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోడౌన్‌లను నర్వకు మంజూరు చేశారన్నారు. నిర్మాణం కోసం రూ. 56 లక్షలతో సొసైటీ నుంచి 2.14 గుంటల భూమిని కొనుగోలు చేశామన్నారు. దీంతో పాటు మరో రెండు ఎకరాల భూమిని కేటాయించామన్నారు. మూడున్నర సంవత్సరాల కాలంలో రూ.కోటి 15 లక్షలు సొసైటీకి లాభం వచ్చిందన్నారు. పనిచేసినంత కాలం సొసైటీ అభివృద్ధికి పాటుపడితే కొందరు కావాలనే తనపై అవినీతి ఆరోపణలకు తెరలేపారని ఆరోపించారు. డైరెక్టర్లు వారం రోజులుగా ప్రత్యేక క్యాంపులకు వెళ్లి తనపై అవిశ్వాసానికి పూనుకున్నారని ఇది ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. రైతులు, మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజీనామా పత్రాన్ని ఉంచారు. అనంతరం ఈ ప్రతిని పీఏసీఎస్ సీఈఓ ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు హాజరై ఆయనకు మద్దతు పలికారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి
- పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు



జాజాపూర్‌లో ఎద్దుల బండిపై పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ చేసి చూపించిందన్నారు. కుల, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత కేసీఆర్ సొంతమని కొనియాడారు. అధికార వికేంద్రీకరణ, పరిపాలన సౌలభ్యం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకుని వచ్చారని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అంతకు ముందు ఎద్దుల బండిపై ర్యాలీగా గ్రామంలో పర్యటించారు.

పర్యటన ఇలా...

సోమవారం ఎమ్మెల్యే నారాయణపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జలాల్‌పూర్‌లో రూ.15లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం భూమిపూజ, జాజాపూర్‌లో రూ.15లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, రూ.15లక్షలతో మహిళా సంఘం భవనం, షేర్నపల్లిలో రూ.15లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, సింగారంలో రూ.15లక్షల మహిళా సంఘం భవనానికి, లింగంపల్లిలో రూ.22లక్షలతో ఎల్లమ్మ దేవాలయంలో విశ్రాంతి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేపూరిరాములు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

శిశుమందిరంలో మహా గాయత్రి యజ్ఞం



యజ్ఞం చేస్తున్న విద్యార్థులు

నారాయణపేట టౌన్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా సోమవారం పట్టణంలోని సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాల, అశోక్‌నగర్, ధూల్‌పేట, రామాలయం ప్రాథమిక పాఠశాలలో ఆధ్వర్యలో వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య మహా గాయత్రి యజ్ఞం నిర్వహించారు. విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయిలో రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. అంతకు ముందు సరస్వతీదేవి, భారతమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదం వితరణ చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాఠశాలకు హాజరై గురువులు బోధించే విషయాలను శ్రద్ధగా వినాలని సూచించారు.

సంతలో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాజాతా

మరికల్: వారాంతంలో జరిగే సంతల్లో వ్యాపారులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాజాతా బృందం మరికల్‌లో సోమవారం జరిగిన సంతలో అవగాహన కల్పించారు. సంతలో జనం రద్దీగా ఉండటం వల్ల దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో దొంగనోట్లను చాలామణి చేసేందుకు ప్రయత్నిస్తారని, వీటిని వ్యాపారులు గుర్తు పట్టి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్లు చోరీ చేసే వారిపై, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుఖ్యానాయక్ పాల్గొన్నారు.

సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్

నారాయణపేట రూరల్: పట్టణంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపక బృందం సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. తొలి ప్రయత్నంలోనే న్యాక్ గుర్తింపు లభించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకుల నేతృత్వంలో ప్రిన్సిపాల్ రంగారెడ్డి, న్యాక్ కో ఆర్డినేటర్ నారాయణగౌడ్‌లను శాలువాతో సన్మానించారు. ఎంతో కష్టపడి కళాశాలను అందంగా ముస్తాబు చేసి, అవసరమైన సౌకర్యాలను కల్పించి, అందరిని సమన్వయం చేయడంలో సఫలీకృతులయ్యారని, బి ప్లస్ గ్రేడ్ రావడం అభినందనీయమని కొనియాడారు. త్వరలో విజయోత్సవ సభను ఏర్పాటు చేసి ఆనందాన్ని అందరితో పంచుకుందామని తెలిపారు.

నేరాల నియంత్రణలో పోలీసుల తీరు భేష్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీసుల పనితీరు బాగుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2 కె రన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక శివాజీ చౌరస్తా నుంచి బహార్‌పేటలోని చెక్ పోస్ట్ వరకు చేపట్టిన రన్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ పోలీస్ వ్యవస్థ చురుకుగా పని చేస్తుందన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న టెన్నిస్ కోర్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, నాయకులు రాజేష్, శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



స్వరాష్ట్రంలోనే అభివృద్ధి

దామరగిద్ద: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సమక్షంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రన్ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఆశన్న, విండో అధ్యక్షుడు ఈదప్ప, ఎంపీపీ నర్సప్ప మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బస్వరాజ్, రాఘవేందర్, జ్ఞానేశ్వర్, అంజి, శ్రీనివాస్, అశోక్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని గార్లపల్లికి చెందిన కుర్వ మల్లమ్మ, లక్ష్మిలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరయ్యారు. ఈసందర్భంగా సోమవారం మండల కేంద్రంలో బాధితులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెక్కులు అందజేశారు. ఈ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, నేతాజీ రెడ్డి, రాంలింగం, శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



రివ్యూ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

ధన్వాడ: మండలంలోని వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ కోయ హర్ష రివ్యూ నిర్వహించారు. సోమవారం సాయంత్రం అన్ని శాఖల అధికారులను ఎంపీడీఓ కార్యాలయంలో హాజరు పరిచి ప్రతి విషయంపై అధికారులతో చర్చించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి నెల మండల అధికారులు గ్రామాల వారిగా రివ్యూ నిర్వహించాలని సూచించారు. అలాగే ఎస్ఆర్ఈజీఎస్‌లో కూలీలకు కూలి అధికంగా వచ్చే విధంగా కొలతలు సరిగ్గా తీసుకోవాలన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలకు డిమాండ్



మిషన్ భగీరథ అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ పూర్యనాయక్

ధన్వాడ: అధికారులు ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని, సర్వ సభ్య సమావేశం తూతూ మంత్రగా కొనసాగిస్తున్నారని ధన్వాడ ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, ఉమేష్‌కుమార్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మనీబాయి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. కొండాపూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఎంపీపీ పద్మినీబాయిని కనీసం స్టేజీ మీదకు కూడా పిలవకుండా అవమానించారని మండిపడ్డారు. సర్వసభ సమావేశానికి హాజరు కాని ఏఓ ప్రదీప్‌పై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేయాలన్నారు. ఎంపీటీసీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గున్ముక్ల గ్రామానికి ఆర్టీసీ బస్సును నిలిపివేశారని, ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున అధికారులు బస్సును పునరుద్ధరించాలని కోరారు. మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కావడం లేదని సర్పంచులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వాహిద్, ఎంపీడీఓ సద్గుణ తదితరులు పాల్గొన్నారు

పల్లె ప్రగతిని విజయవంతం చేయాలి

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15న నిర్వహించే పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పల్లెప్రగతి నిర్వహణపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేయడం, గ్రామంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళ సంక్షేమ దినోత్సవం

మండల కేంద్రంలోని గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని మధ్యాహ్నం 1:30 నిమిషాలకు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

పేదలకు కల్యాణలక్ష్మి వరం



చెక్కుల పంపిణీ చేస్తున్న ఎంపీపీ

కోస్గి: పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరంగా మారాయని మధుకర్ రావు అన్నారు. సోమవారం గుండుమాల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదని ప్రభుత్వం రూ.లక్ష పైగా ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

మద్దూరు: మండల కేంద్రంలోని గ్రీన్ ప్యాలెస్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ చింతరవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి సంబంధించిన 170 చెక్కులు లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు.

బీకేఎస్ నాయకుడికి పరామర్శ



నారాయణపేట టౌన్: ఇటీవల నారాయణపేట నుంచి అయోధ్య నగరాన్ని సందర్శించేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రెండు వాహనాలు ఢీకొనడంతో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాయపడిన కుమ్మరి విశ్వనాథ్‌ను సోమవారం ఆయన నివాసంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి పరామర్శించి, ప్రమాదం గురించి ఆరా తీశారు. ప్రసుత్త ఆరోగ్య విషయంపై అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలువావాలని, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. వీరి వెంట బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ఊట్కూర్ మండల కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకోండి

నర్వ: వెనుకబడిన తరగతుల కులవృత్తి దారులు రూ. లక్ష రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. దరఖాస్తుదారులు 18 నుంచి 55 ఏళ్ల వరకు వయస్సు ఉండాలని వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు ఆదాయం ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, ఆహారభద్రతకార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు..

బీసీ కులవృత్తిదారులు రూ. లక్ష రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో అందిస్తామని తహసీల్దార్ రాజగణేష్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని కేటాయించి సకాలంలో ధ్రువపత్రాలను అందిస్తామన్నారు.

అటవీ శాఖ అధికారుల తనిఖీ



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: ‘యథేచ్ఛగా కలప అక్రమ రవాణా’ శీర్షికతో సోమవారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీంతో అటవీ శాఖ అధికారులు స్పందించారు. పత్రికలో వచ్చిన కలప లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి జరిమానా విధించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సోమవారం తనిఖీ చేపట్టారు. కృష్ణ మండలం గుడెబాల్లూర్ నుంచి మక్తల్ వైపునకు కలప లోడ్‌తో వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను గుర్తించారు. ఎలాంటి అటవీశాఖ అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను మాగనూర్ పోలీస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమాని అంజప్పపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి నీలేష్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా వంట చెరుకును అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీలు నెరవేర్చాలని చలో కలెక్టరేట్



ర్యాలీ చేస్తున్న నాయకులు

నారాయణణపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ ఆకాంక్ష దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా చలో కలెక్టరేట్ ర్యాలీ నిర్వహించారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ కలెక్టరేట్ వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాములు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిరుపేదలకు కట్టిస్తామని ఇచ్చిన డబుల్ బెడ్ రూం నిర్మించి ఇస్తామని చెప్పి, పదేళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇవ్వలేదని విమర్శించారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూం నిర్మించి ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్న వారికీ ఇళ్ల నిర్మాణం కోసం రూ. 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నారాయణ, మండల కార్యదర్శి నర్సింహులు, మద్దూర్ మండల కార్యదర్శి కొండ నర్సింహులు, ఊట్కూర్ మండల కార్యదర్శి రామాంజనేయులు, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సౌజన్య, కోటకొండ ఎంపీటీసీ సునీత, పాతపల్లి సర్పంచ్ కృష్ణయ్య, మైనార్టీ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ పాసులు సిద్ధం

నారాయణపేట రూరల్: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు రవాణా సౌకర్యార్థం పాసులు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ డీఎం ఆంజనేయులు తెలిపారు. 12ఏళ్ల లోపు అబ్బాయిలకు, పదో తరగతి వరకు అమ్మాయిలకు ఉచితంగాను, మిగితా వారికి రాయితీ పాసులు వర్తిస్తాయన్నారు. దీనికి గాను ప్రభుత్వ పాఠశాలలు నేరుగా, ప్రైవేట్ విద్యా సంస్థలు రెన్యూవల్ ఫీ చెల్లించాలన్నారు. కొత్త పాఠశాలలకు రూ.2వేలు, పాత వాటికి రూ.1,500, కళాశాలలు కొత్తగా రూ.5వేలు, రెన్యూవల్‌కు రూ.4వేలు చెల్లించి విద్యా సంస్థకు సంబందించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాలన్నారు. చిన్నారులు తమ అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కొత్త టికెట్ ధరలకు అనుగుణంగా ఐడీ కార్డుతో కలుపుకుని బస్‌పాస్ ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఐదు కిలోమీటర్లకు రూ.200, పది కిలోమీటర్లకు రూ.300, పదిహేను కి.మీలకు రూ.350, ఇరవై కి.మీలకు రూ.450, ఇరవై ఐదు కి.మీలకు రూ.500, ముప్పై కి.మీలకు రూ.550, ముప్పై ఐదు కి.మీలకు రూ.600 చొప్పున చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు బస్‌పాస్ సెక్షన్ ఇన్‌చార్జీ పకీరప్పను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు స్వాగత ఏర్పాట్లు..



కన్మనూర్‌లో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



ధన్వాడ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధన్వాడ: నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ధన్వాడలో హెచ్ఎం రమేష్ విద్యార్థులకు వెల్‌కం డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యార్థులకు సాగ్వతం పలికారు.

మోగిన బడి గంట..

మరికల్: ప్రభుత్వం పాఠశాలలకు కేటాయించిన వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో సోమవారం బడిగంట మోగడంతో విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. సెలవుల తర్వాత పాఠశాలకు మొదటి రోజు కావడంతో విద్యార్థులు తక్కువగా హాజరయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. నిత్యం క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. బడి బయట పిల్లలు కూడా బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేద్దాం..



నిడుగుర్తిలో బడిబాట ర్యాలీ చేస్తున్న సర్పంచ్

ఊట్కూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దామని సర్పంచ్ యశోదమ్మ అన్నారు. సోమవారం వేసవి సెలవుల అనంతరం నిడుగుర్తి పాఠశాలను ప్రారంభించారు. బడిబాటలో భాగంగా గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందస్తారన్నారు. కార్యక్రమలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునీత, వెంకటప్ప, కలాం, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.